ఫలించిన కోదండరామ్ వ్యూహం



కోదండరామ్‌ను సన్మానించిన నేతలు

ఉస్మానియా యూనివర్సిటీ: మూడోసారి బీఆర్‌ఎస్ పార్టీ అధికారంలోకి రాకుండా తెలంగాణ జన సమితి (టీజేఎస్) రాష్ట్ర అధ్యక్షులు ప్రొ.కోదండరామ్ వ్యూహం ఫలించిందని ఆ పార్టీ యువజన సమితి రాష్ట్ర అధ్యక్షులు, ఓయూ పరిశోధక విద్యార్థి సయ్యద్ సలీం పాషా పేర్కొన్నారు. మంగళవారం ఓయూ విద్యార్థులు కోదండరామ్‌ను ఆయన నివాసంలో పూలమాలతో సత్కరించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా సలీంపాషా మాట్లాడుతూ.. పదేళ్ల కేసీఆర్ నియంతృత్వ పాలన అంతానికి ప్రొ.కోదండరామ్ అలుపెరగని పోరాటాలు చేశారన్నారు. పోలీసు కేసులు, నిర్బంధాలను ఎదుర్కొని అవమానాలను భరించి అమరుల త్యాగాలు, తెలంగాణ ప్రజల ఆకాంక్షల కోసం జరిగిన ఆఖరి పోరాటంలో విజేతగా నిలిచారన్నారు. నిరుద్యోగులు, రైతులు, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై కొట్లాడిన ప్రొ.కోదండరామ్ బీఆర్‌ఎస్ ఓటమికి చివరకు ఎన్నికల్లో పోటీ చేయకుండా కేసీఆర్‌ను గద్దె దించేందుకు త్యాగం చేశారని కొనియాడారు. కార్యక్రమంలో విద్యార్థి నేతలు అరుణ్‌కుమార్, ఇంద్రానాయక్, మహేష్, వెంకట్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సీఎంగా రేవంత్‌రెడ్డి ప్రకటనపై హర్షం



శ్రీనివాసులు గౌడ్

లాలాపేట: టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి సీఎల్పీ నాయకుడిగా ఎన్నికవ్వడం, రాష్ట్ర ముఖ్యమంత్రిగా త్వరలో ప్రమాణ స్వీకారం చేస్తుండటంపై రాష్ట్రవ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ శ్రేణులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ మేరకు మంగళవారం టీపీసీసీ లీగల్ సెల్ వైస్ చైర్మన్ ఎస్ఎల్ శ్రీనివాసులు గౌడ్ లాలాపేటలో విలేకరులతో మాట్లాడారు. రేవంత్‌రెడ్డి నాయకత్వంలో తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ ప్రజా ప్రభుత్వం ఏర్పాటు కాబోతుందని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రకటించిన ఆరు గ్యారెంటీలను కచ్చితంగా అమలు చేస్తోందన్నారు.

ఆత్మవిశ్వాసంతో పార్లమెంట్ ఎన్నికలకు సిద్ధమవుదాం



మాట్లాడుతున్న మర్రి శశిధర్‌రెడ్డి

సనత్‌నగర్: అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజల తీర్పును అంగీకరిద్దామని, ఆత్మ విశ్వాసంతో పార్లమెంట్ ఎన్నికలకు సిద్ధమవుదామని మాజీ మంత్రి మర్రి శశిధర్ రెడ్డి పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. మంగళవారం బేగంపేటలోని పైగా ప్యాలెస్‌లో అసెంబ్లీ ఎన్నికల కృతజ్ఞత సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గతంలో ఎన్నడూ లేని విధంగా సనత్‌నగర్ నియోజకవర్గంలో 30730 ఓట్లను సాధించడం ద్వారా బీజేపీ తన బలాన్ని పెంచుకుందన్నారు. ఇదే ఊపుతో పార్లమెంట్ ఎన్నికల్లో పనిచేసి మరోసారి బీజేపీ ప్రభుత్వాన్ని గెలిపించే లక్ష్యంతో ప్రతి కార్యకర్త పని చేయాలన్నారు. సతన్‌నగర్‌తో తన ఓటమికి కారణాలను విశ్లేషిస్తూ ఆయన బూత్ కమిటీల వ్యవహారాన్ని తప్పుబట్టారు. కాగితాలకే బూత్ కమిటీలు పరిమితం అయ్యాయని, వాస్తవానికి చాలా డివిజన్‌లలో బూత్ కమిటీలు లేనే లేవని అసంతృప్తి వ్యక్తం చేశారు. బీఆర్‌ఎస్‌కు గట్టి పోటీ ఇచ్చినప్పటికి ఓటమికి మాత్రం కారణాలు అనేకం ఉన్నాయన్నారు. ఇలాంటి తప్పిదాలను పునరావృతం కాకుండా పార్టీ పటిష్టతకు పనిచేస్తూ ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వాన్ని మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. ప్రస్తుత స్థానిక ఎమ్మెల్యే ఎన్నికల్లో పలువురిని బెదిరించినట్లు తమకు ఫిర్యాదులందాయని, బాధితులకు తాము అండగా ఉంటామన్నారు. సమావేశంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు బూర్గుల శ్యామ్‌సుందర్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు దయానంద్, కార్పొరేటర్ చీర సుచిత్ర, జిల్లా కమిటీ నాయకులు పెద్ది రవీందర్, రాజశేఖర్, నియోజకవర్గం కన్వీనర్ శ్రీశైలంగౌడ్ పాల్గొన్నారు.

కార్యకర్తలే నా బలం..బలగం..



సమావేశంలో మాట్లాడుతున్న విజయారెడ్డి

ఖైరతాబాద్: ఖైరతాబాద్ నియోజకవర్గ ప్రజలు తనపై ఎంతో నమ్మకంతో ఓటు వేశారని, వారందరికీ తాను రుణపడి ఉంటానని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి పి.విజయారెడ్డి అన్నారు. మంగళవారం ఖైరతాబాద్‌లోని మోద్రస్ ఫంక్షన్‌హాల్‌లో కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా విజయారెడ్డి మాట్లాడుతూ ఖైరతాబాద్‌లో కాంగ్రెస్ పార్టీకి పూర్వ వైభవం తీసుకువస్తానని, తపై నమ్మకంతో ఓటు వేసిన వారందరికీ ఆమె కృతజ్ఞతలు తెలిపారు. 45వేల ఓట్లతో ఖైరతాబాద్ ప్రజలు తనను ఆదరించారని, ఓటమి పాలైనంత మాత్రాన నిరుత్సాహ పడకుండా ప్రజా సేవలో ఉంటానని, మరోసారి రెట్టించిన ఉత్సాహంతో ముందుకు సాగేందుకు కలిసి కట్టుగా కృషిచేయాలన్నారు. కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో అధికారంలోకి రావడం ఆనందంగా ఉందని, కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారంటీలను ప్రతి ఇంటికి చేర్చేందుకు కార్యకర్తలు కృషి చేయాలన్నారు. తన బలం, బలగం ఖైరతాబాద్ ప్రాంత ప్రజలేనన్నారు. అతి తక్కువ సమయంలోనే తనను ఆదరించిన ప్రతి ఒక్కరికీ అండగా ఉంటానని హామీ ఇచ్చారు. ఎన్నికల్లో ఓటమిపాలయ్యామని అధైర్యపడకుండా రెట్టించిన ఉత్సాహంతో ముందుకు సాగాలని సూచించారు. సమావేశంలో నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

కొట్టేసి.. వదిలేశారు..

అటెన్షన్ ప్లీజ్...



బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్ నెం.12లోని లోటస్‌పాండ్‌లో పది రోజుల క్రితం ఓ భారీ చెట్టు వర్షానికి నేలకొరిగింది. వెంటనే స్పందించిన జీహెచ్ఎంసీ డీఆర్‌ఎఫ్ సిబ్బంది రోడ్డుకు అడ్డుగా ఉన్న చెట్టు కొమ్మలను కొట్టివేసి పక్కన పడేశారు. అప్పటి నుంచి వాటిని తొలగించలేదు. దీంతో ఆ ప్రాంతంలో అపరిశుభ్ర వాతావరణం నెలకొంది. కాలనీవాసులు వ్యర్థాలను తొలగించాలని ఫిర్యాదు చేసినా సదరు అధికారులు, సిబ్బంది పట్టించుకోవడం లేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి.

మృత్యు మలుపులు!



- ప్రమాదకరంగా మారిన మూలమలుపులు
- భయాందోళనలో వాహనచోదకులు
- రోడ్లు విస్తరించాలంటున్న ప్రజలు
- విస్మరిస్తున్న అధికారులు

అడ్డగుట్ట: రోడ్డు విస్తరణ చేయకపోవడంతో ప్రమాదకరమైన మూలమలుపులతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని వాహనదారులు వాపోతున్నారు. అడ్డగుట్ట డివిజన్‌లో ప్రధాన రోడ్ల మార్గాన అనేక మూలమలుపులు ఉన్నాయి. సికింద్రాబాద్ నుంచి మల్కాజిగిరి, లాలాపేట్, మెట్టుగూడ, తార్నాక, మౌలాలి, నేరేడ్‌మెట్, సైనిక్‌పురి తదితర ప్రాంతాలకు వేళ్లే వాహనదారులు అడ్డగుట నుంచి వెళ్తుంటారు. ఈ దారిగుండా ట్రాఫిక్ సిగ్నల్స్ ఉండవు, షార్ట్‌కట్ కూడా ఉంటుంది. దీంతో ప్రయాణికులు వారి వారి గమ్యాలకు చేరుకోవడానికి అతి చేరువగా ఉంటుందని ఈ మార్గాన్ని ఎంచుకుంటారు. కానీ.. ఇక్కడున్న మూలమలుపుల కారణంగా వాహనాల రాకపోకలకు తీవ్ర సమస్యలు తలెత్తడంతో అటు ప్రమాదాలు కూడా జరుగుతున్నాయి.

ఇరుకు రోడ్లు..

తుకారాంగేట్‌లోని ఇందిరా గాంధీ విగ్రహం, లాలాగూడ రైల్వే స్టేషన్ లాలాగూడ రైల్వే హాస్పిటల్‌కు వెళ్లే ప్రధాన రోడ్లలో ప్రమాదకరంగా మూల మలుపులు ఉన్నాయి. ఒకేసారి రెండు వాహనాలు పోవడానికి వీలులేకుండా ఉంటుంది. దీంతో ప్రయాణికులు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారు. ఎటు నుంచి ఏ ప్రమాదం వస్తోందో స్థానిక దుకాణాల్లోకి ఏ సమయంలో వాహనాలు దూసుకొస్తాయో అని



లాలాగూడ రైల్వే హాస్పిటల్‌కు వెళ్లే మార్గంలో ప్రమాదకరంగా ఉన్న మూలమలుపు

దుకాణదారులు ఆందోళనకు గురవుతున్నారు.

రోడ్డు విస్తరణతో మేలు..

రోడ్డు విస్తరణ జరిగితేనే ప్రమాదకరమైన మూల మలుపుల సమస్య తీరుతుందని స్థానికులు, ప్రయాణికులు ఏళ్లుగా ఎదురుచూస్తున్నారు. ప్రమాదకరంగా ఉన్న మూల మలుపు, ఇరుకు రోడ్ల కారణంగా పలు సమయాల్లో ఎదురెదురుగా వస్తున్న వాహనాలు యాక్సిడెంట్లకు గురైన సంఘటనలు ఎన్నో ఉన్నాయి. తుకారాంగేట్‌లోని ఇందిరా గాంధీ విగ్రహం రోడ్డు మూల మలుపులోనే ప్రమాదకరంగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఉంది, దానికి రక్షణ కంచె కూడా లేదు. ఇలాంటి ప్రమాదాల మధ్య వాహనదారులు రాకపోకలు సాగిస్తున్నారు. ఇప్పటికైన అధికారులు స్పందించి రోడ్డు విస్తరణ చేసేందుకు తగిన చర్యలు చేపట్టాలని వాహనదారులు కోరుతున్నారు.

రోడ్డు విస్తరిస్తే సమస్యకు పరిష్కారం..



తుకారాంగేట్, లాలాగూడ రైల్వే హాస్పిటల్ సమీపం, న్యూ బ్రిడ్జ్ ప్రధాన రోడ్లలో ఉన్న ప్రమాదకరమైన మూల మలుపుల కారణంగా చాలా ఇబ్బందులు పడుతున్నాం. దగ్గరకు వచ్చే వరకు ఎదురుగుండా వచ్చే వాహనాలు కనిపించవు. ఈ విషయంపై ఏ ఒక్కరూ దృష్టి సారించడంలేదు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు చొరవ తీసుకొని ప్రమాదకరమైన మూల మలుపు సమస్యలను పరిష్కరించి వాహనదారులకు భద్రత కల్పించాలి.

–గంట రాజుసాగర్, అడ్డగుట్ట

హ్యాట్రిక్ విజయం అభినందనీయం



ఎమ్మెల్యే పద్మారావును కలిసిన తార్నాక నేతలు



పద్మారావుగౌడ్‌కు స్వీట్ తినిపిస్తున్న కార్పొరేటర్ ప్రసన్నలక్ష్మి

అడ్డగుట్ట: సికింద్రాబాద్ ఎమ్మెల్యేగా భారీ మెజారిటీతో విజయం సాధించిన పద్మారావుగౌడ్‌ను అడ్డగుట్ట డివిజన్ కార్పొరేటర్ లింగాని ప్రసన్నలక్ష్మి పార్టీ నేతలతో కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా పద్మారావుగౌడ్‌కు మిఠాయి తినిపించి శాలువాతో ఘనంగా సత్కరించారు. సికింద్రాబాద్ గడ్డ పద్మారావు గౌడ్ అడ్డా అని మరోసారి రుజువైందని, విపత్కర పరిస్థితుల్లో కూడా 45 వేల పైచిలుకు మెజారిటీతో విజయం సాధించడం చాలా గొప్ప విషయమని ఈ సందర్భంగా కార్పొరేటర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో లింగాని శ్రీను, శ్రీనివాస్ గౌడ్, మనోహర్, వసంత, పొన్నాల రాజు, మహ్మద్ గౌస్, నర్సింగ్ దేవయ్య, మోహన్, సుజాత, రజిని పాల్గొన్నారు.

తార్నాక డివిజన్ నేతలు..

లాలాపేట: సికింద్రాబాద్ ఎమ్మెల్యేగా గెలుపొందిన పద్మారావు గౌడ్‌ను మంగళవారం ఆయన నివాసంలో తార్నాక డివిజన్ బీఆర్‌ఎస్ నేతలు మర్యాదపూర్వకంగా కలిసి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పలువురు నేతలు మాట్లాడుతూ.. హ్యాట్రిక్ విజయంలో సికింద్రాబాద్ అసెంబ్లీలో పద్మారావుగౌడ్ చరిత్ర సృష్టించారన్నారు. ఈ కార్యక్రమంలోసునీల్ ముదిరాజ్, మల్లికార్జున్, నాగేశ్వర్‌రావు, శ్రీనివాసుగౌడ్ పాల్గొన్నారు.

అందరికీ అందుబాటులో ఉంటా

ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్

సనత్‌నగర్: నియోజకవర్గ వాసులందరికీ నిరంతరం అందుబాటులో ఉంటానని సనత్‌నగర్ నుంచి గెలుపొందిన ఎమ్మెల్యే, మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ పేర్కొన్నారు. మంగళవారం వెస్ట్ మారేడ్‌పల్లిలోని తన నివాసం వద్ద కార్పొరేటర్లు, మాజీ కార్పొరేటర్లు, వివిధ ప్రాంతాలకు చెందిన బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఆయనను కలిసి సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా తలసాని మాట్లాడుతూ.. ఎవరికి ఏ అవసరమొచ్చినా మొదటి నుంచి తాను అండగా నిలిచానని, ఇక ముందు కూడా ఉంటాననే విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. కార్యక్రమంలో ఉస్మానియా వైస్ చాన్సలర్ రవీందర్‌యాదవ్, బేగంపేట కార్పొరేటర్ మహేశ్వరి, డివిజన్ అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్, మాజీ కార్పొరేటర్లు నామన శేషుకుమారి, కిరణ్మయి కిషోర్, నాయకులు శ్రీహరి, శేఖర్, అమీర్‌పేట్ మర్చంట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఉత్తమ్ కుమార్‌సింగ్‌రాజ్ పురోహిత్, చరణ్ సింగ్, సుబ్బరాజు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే తలసానికి శుభాకాంక్షలు తెలుపుతున్న కార్పొరేటర్ మహేశ్వరి

షార్ట్ సర్క్యూట్‌తో అగ్ని ప్రమాదం







కాలిపోయిన వస్తువులు

రూ. 5 లక్షల ఆస్తినష్టం

వెంగళరావునగర్ : షార్ట్ సర్క్యూట్ కారణంగా అగ్ని ప్రమాదం చోటు చేసుకుని దాదాపు రూ.5 లక్షల వరకు ఆస్తి నష్టం వాటిల్లిన సంఘటన మధురానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో మంగళవారం చోటు చేసుకుంది. సనత్‌నగర్ ఫైర్ అధికారుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. మధురానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని వెస్ట్ శ్రీనివాస్‌నగర్ కాలనీలో ఓ మీడియా సంస్థ కార్యాలయం కొనసాగుతుంది. సోమవారం రాత్రి విధులు ముగించుకుని సిబ్బంది తాళాలు వేసి వెళ్లిపోయారు. మంగళవారం ఉదయం దాదాపు 9 గంటల సమయంలో షార్ట్ సర్క్యూట్ కారణంగా నిప్పంటుకుని మంటలు చెలరేగాయి. ఈ ఘటనలో కార్యాలయంలో ఉన్న సెంట్రల్ ఏసీ, టీవీ, సీలింగ్, చైర్స్, ఫ్యాన్లు తదితర సామగ్రి కాలి బూడిదయ్యాయి. సంస్థ యజమాని సమాచారంతో సనత్‌నగర్ ఫైర్ సిబ్బంది, మధురానగర్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తెచ్చారు. ఈ ఘటనలో దాదాపు రూ.5 లక్షల వరకు ఆస్తినష్టం వాటిల్లి ఉండవచ్చునని పోలీసులు ప్రాథమికంగా అంచనా వేశారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

రేవంత్‌రెడ్డి విజయం అమోఘం

లాలాపేట: అసెంబ్లీ ఎన్నికల్లో కొడంగల్ నుంచి భారీ మెజార్టీతో ఎమ్మెల్యేగా గెలుపొందిన టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి విజయం అమోఘమని కాంగ్రెస్ పార్టీ గ్రేటర్ హైదరాబాద్ ప్రచార కమిటీ కోఆర్డినేటర్ శ్రీరామ్ శివకుమార్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా శివకుమార్ మాట్లాడుతూ.. గతంలో దివంగత నేత డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయాంలో కాంగ్రెస్ పార్టీకి తీసుకువచ్చిన వైభవం తిరిగి సుదీర్ఘ కాలం తర్వాత రేవంత్‌రెడ్డి నాయకత్వం లోనే వచ్చిందన్నారు. ఈ నెల 7న సీఎంగా ప్రమాణ స్వీకారం చేయనున్న రేవంత్‌రెడ్డి నాయకత్వంలో తెలంగాణ ప్రజలకు నిజమైన ప్రజాస్వామ్య పరిపాలన వస్తుందనీ ధీమా వ్యక్తం చేశారు.

ల్యాప్‌టాప్, సెల్‌ఫోన్ చోరీ

అమీర్‌పేట: హాస్టల్ గదిలో నుంచి ఓ ల్యాప్‌టాప్, సెల్‌ఫోన్ చోరీకి గురైన ఘటన ఎస్ఆర్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం.. ఎస్ఆర్‌నగర్‌లోని వీ.ఆర్.మెన్స్ హాస్టల్‌లో హార్థిక్‌రెడ్డి అనే విద్యార్థి ఉంటున్నాడు.సోమవారం స్నేహితుడిని కలిసేందుకు గది నుంచి బయటకు వచ్చాడు. కాసేపటి తర్వాత వెళ్లి చూడగా అతడి ల్యాప్‌టాప్, సెల్‌ఫోన్ కనిపించకుండా పోయాయి. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు.

గుర్తు తెలియని మహిళ మృతదేహం లభ్యం

రాంగోపాల్‌పేట్: సికింద్రాబాద్ వెస్ట్ మెట్రో రైల్వే స్టేషన్ పరిసరాల్లోని ఖాళీ ప్రదేశంలో ఓ గుర్తు తెలియని మహిళ మృతదేహాన్ని మార్కెట్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల వివరాల ప్రకారం.. ఈ నెల 3వ తేదీన ఆల్ఫా హోటల్ ఎదురుగా ఉండే వెస్ట్ మెట్రో రైల్వే స్టేషన్ పార్కింగ్ వద్ద ఉండే ఖాళీ ప్రదేశంలో 25 – 35 ఏళ్ల వయసు గల ఓ గుర్తు తెలియని మహిళ మృతదేహం ఉన్నట్లు సమాచారం అందుకున్న పోలీసులు వెళ్లి స్వాధీనం చేసుకున్నారు. మృతురాలి ఒంటిపై ఆరెంజ్ కలర్ చుడీదార్ ధరించి ఉందని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ మార్చురీకి తరలించామన్నారు. మృతదేహం పూర్తిగా కుళ్లిపోయిన స్థితిలో ఉండటంతో మూడు రోజుల క్రితం మరణించి ఉండవచ్చని పోలీసులు భావిస్తున్నారు. పోస్టుమార్టం రిపోర్టు వస్తేనే కారణాలు తెలుస్తాయని పోలీసులు తెలిపారు.

సమష్టి కృషితోనే ప్రశాంతంగా ఎన్నికలు

ఫిలింనగర్: అధికారులు, సిబ్బంది సమష్టి కృషితోనే అసెంబ్లీ ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించగలిగామని ఖైరతాబాద్ జోనల్ కమిషనర్ వెంకటేష్ దోత్రే అన్నారు. మంగళవారం ఆయన ఎన్నికల విధుల్లో పాల్గొన్న అధికారులను అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎలాంటి తప్పిదాలు జరగకుండా ప్రశాంతంగా ఎన్నికలు ముగిశాయన్నారు. ఎన్నికల ప్రకటన వెలువడిన నాటి నుంచి అందరూ సమష్టిగా అకుంఠిత దీక్షతో పని చేశారన్నారు.ఈ సందర్భంగా అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. డీ ఎం సీ ప్రశాంతి, తహసీల్దార్ అనితా రెడ్డి, సంపత్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా రుద్రాభిషేకం

పంజగుట్ట: నియోజకవర్గ పరిధిలోని పద్మావతి కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం కార్తీకమాసాన్ని పురస్కరించుకుని రుద్రాభిషేకం, వనభోజనం కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి టీపీసీసీ ప్రధానకార్యదర్శి పి.విజయారెడ్డి హాజరై స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు సురేఖ, ప్రభాకర్‌రావు, మోహన్ రావు, పద్మజ, సరళ తదితరులు పాల్గొన్నారు.

'కాంగ్రెస్‌ను బలపరిచిన క్రైస్తవులు'

రాంగోపాల్‌పేట్: రాష్ట్రంలో జరిగిన శాసనసభ ఎన్నికల్లో 90 శాతం క్రైస్తవులు, దళిత క్రైస్తవులు కాంగ్రెస్ పార్టీకి మద్దతు తెలిపి ఆ పార్టీకి విజయాన్ని అందించారని ఆల్ ఇండియా కాంగ్రెస్ కమిటీ మైనార్టీ విభాగం జాతీయ కో ఆర్డినేటర్ గద్దపాటి విజయరాజు ఒక ప్రకటనలో తెలిపారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ పార్టీ క్రైస్తవులపై దాడులకు తెగబడటం, తెలంగాణలో మత వైషమ్యాలు సృష్టించి గొడవలు చేయాలని యత్నించారని ఆరోపించారు. కానీ మత సామరస్యాన్ని ఆకాంక్షించే క్రైస్తవులు మాత్రం ఓటులో బీజేపీ బుద్ధి చెప్పారని తెలిపారు. పరిపాలనలో కేసీఆర్ కుటుంబం జోక్యం ఎక్కువ కావడం, ప్రగతి భవన్ సామాన్యుడికి అందనంత దూరంలో ఉండటం, కేసీఆర్ నియంతలా వ్యవహరించడంతో తెలంగాణ ప్రజలు ఆ పార్టీ పట్ల వ్యతిరేకత చూపారని పేర్కొన్నారు. అన్ని రకాల పదవులు కేసీఆర్ కుటుంబానికి మాత్రమే దక్కడంతో పాటు బీజేపీతో అంతర్గత ఒప్పందాలు చేసుకున్నారనే అనుమానాలు క్రైస్తవులకు బలపడటంతో ఆ పార్టీని ఓడించారని తెలిపారు.

విద్యుదాఘాతం.. గృహోపకరణాల దగ్ధం



రాంగోపాల్‌పేట్: రాంగోపాల్‌పేట్ డివిజన్‌లోని వెంగళరావునగర్‌లో మంగళవారం మధ్యాహ్నం ఓ ఇంట్లో అగ్నిప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంతో ఇంట్లోని వస్తువులన్నీ కాలి బూడిదయ్యాయి. వెంగళరావునగర్‌లో రమ అనే మహిళ అంగన్‌వాడీ టీచర్‌గా పనిచేస్తుంది. ఉన్నట్లుండి ఆమె ఇంట్లో మంటలు చెలరేగాయి. స్థానికులు వచ్చి మంటలను అదుపు చేసే లోపు ఇంట్లోని వస్తువులు కాలిపోయాయి. విషయం తెలుసుకున్న స్థానిక కార్పొరేటర్ చీర సుచిత్ర అక్కడికి చేరుకుని అగ్నిప్రమాదంతో నష్టపోయిన రమకు రూ.25వేల ఆర్థిక సహాయం అందించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు నరేష్, సాగర్, స్వప్న, అశ్విని, నరేంద్రపాల్, ధన్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు అంబేడ్కర్ స్మారక ఉపన్యాసం

లిబర్టీ: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ వర్ధంతిని పురస్కరించుకుని ఈ నెల 6న అంబేడ్కర్ స్మారక ఉపన్యాసం నిర్వహిస్తున్నట్లు అంబేడ్కర్ మెమోరియల్ ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ కె.లింగయ్య, ప్రధాన కార్యదర్శి గనుముల జ్ఞానేశ్వర్ తెలిపారు. తెలుగు విశ్వవిద్యాలయంలోని ఎన్‌టీఆర్ సమావేశ మందిరంలో 38వ స్మారక ఉపన్యాసం నిర్వహిస్తున్నామన్నారు. మంగళవారం ట్రస్ట్ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ డాక్టర్ విశ్వ వైతాళికుడు డాక్టర్ బాబా సాహెబ్ అంబేడ్కర్ అంశంపై డాక్టర్ ఘంటా చక్రపాణి ఉపన్యాసం చేస్తారన్నారు. 37 ఏళ్లుగా స్మారక ఉపన్యాస పరంపర కొనసాగుతుందన్నారు. మేధావులు, రచయితలు, కవులు, కళాకారులు, దళిత బహుజనలు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

ఏకపక్ష నిర్ణయాలతోనే ఓటమి

లిబర్టీ: బీఆర్ఎస్ అధినేత కే.చంద్రశేఖర్‌రావు ఏకపక్ష నిర్ణయాలు, నియంతృత్వం వైఖరి కారణంగా ఆ పార్టీ ఓటమి పాలైందని లోక్ దళ్ పార్టీ రాష్ట్ర శాఖ అధ్యక్షులు పీవీ రాజేశ్వరరావు అన్నారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కేసిఆర్ మితిమీరిన ఆత్మవిశ్వాసం, పార్టీ నాయకులు, కార్యకర్తలను విస్మరించినందునే 39 స్థానాలకు పరిమితమయ్యారని స్పష్టం చేశారు. రాష్ట్ర శాసన సభ ఎన్నికల్లో కాంగ్రెస్ ఘన విజయం సాధించడం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారంటీలను అమలు చేయాలని కోరారు.

బాలికపై లైంగిక దాడి

నిందితుడి రిమాండ్

రహమత్‌నగర్ : ఓ బాలికపై లైంగికదాడికి పాల్పడిన సంఘటన బోరబండ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. పోలీస్ పరిధిలోని బస్తీకి చెందిన బాలికపై సోమవారం అదే ప్రాంతానికి చెందిన యవకుడు లైంగిక దాడికి పాల్పడ్డాడు. బాధితురాలి తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు నిందితుడిని అదుపులోకి తీసుకున్న పోలీసులు మంగళవారం అతడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

బీసీ కుల గణన చేపట్టాలి

లిబర్టీ: ప్రధానమంత్రి నరేంద్రమోదీ కుల గణనపై పార్లమెంటులో ప్రకటించి చిత్తశుద్ధి నిరూపించుకోవాలని బీసీ దళ్ జాతీయ అధ్యక్షులు దుండ్రు కుమారస్వామి అన్నారు. పదేళ్లుగా కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం బీసీలు ఎదుర్కొంటున్న సమస్యను కూడా పరిష్కరించలేదన్నారు. మంగళవారం దళ్ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ ప్రస్తుత పార్లమెంట్ సమావేశాల్లోనే కుల గణనపై స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. బీసీ కుల గణనపై ఇప్పటికే ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రక్రియను వేగవంతం చేసే పనిలో ఉన్నారన్నారు. అదే తరహాలోనే కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. చట్టసభల్లో రిజర్వేషన్ల బిల్లును ప్రవేశపెట్టాలని, బీసీ మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. బీసీల సమస్యల పరిష్కరించని పక్షంలో వచ్చే ఎన్నికల్లో బీజేపీని ఓడించి తీరుతామని స్పష్టం చేశారు. సమావేశంలో సాయి, సుభాష్, నవ్య తదితరులు పాల్గొన్నారు.

వైద్య,ఆరోగ్య ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి

కాచిగూడ: రాష్ట్రంలోని వైద్య ఆరోగ్య శాఖ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని ఐఎన్‌టీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, 3194 ఐపీఎం బ్రాంచి అధ్యక్షుడు రాసూరి జ్ఞానేశ్వర్ అన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న సందర్భంగా నారాయణగూడ లోని ఐపీఎంలో ఉద్యోగులతో కలిసి సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దీర్ఘకాలికంగా అపరిష్కృతంగా ఉన్న సమస్యల పరిష్కారంతో పాటు 317, 142 జీఓల విషయంలో ఉద్యోగులకు జరుగుతున్న అన్యాయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ ఏర్పాటుకు కృషి చేసిన ప్రజలు, ఉద్యోగులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో బంగ్లా సునీల్ కుమార్, పి.సుధాకర్, ఆర్.నరేష్, టి.వెంకటేశ్వర్ రావు, సిహెచ్.క్రిష్ణమూర్తి, ఎం.డి. జైనుల్లాబుద్దీన్, ఎ.నర్సింహ, డి.మురళీధర్ రావు, పి.లక్ష్మణ్, రవి, ఎం.రాజు తదితరులు పాల్గొన్నారు.

అలరించిన 'మనసుపాడింది సన్నాయి పాట'

చిక్కడపల్లి: అర్చన కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో త్యాగరాయ గానసభలో అమర గాయకుడు ఘంటసాల వెంకటేశ్వర్‌రావు జయంతి సందర్భంగా మంగళవారం నిర్వహించిన 'మనసు పాడింది సన్నాయి పాట' సినీ సంగీత విభావరి ఆకట్టుకుంది. ప్రముఖ గాయకుడు, నిర్వాకులు అర్చన వెంకటేశ్వరావుతోపాటు సీహెచ్ లలిత, అనంతలక్ష్మి, శకుంతల, జ్యోతి, శారద, అచ్యుత, కార్తికేయ, శ్యామ్, ఫణి, శేఖరుడు తదితరులు ఘంటసాల పాటలను ఆలపించారు. ఈ సందర్భంగా గాయనీగాయకులను రచయిత ఎస్వీరామారావు, యువకళావాహిని అధ్యక్షులు లంకలక్ష్మీనారాయణ, బ్యాక్ ఆఫ్ ఇండియా అధికారి రవికుమార్, కిన్నెర సంస్థ అధినేత మద్దాళి రఘురామ్, రవీందర్‌రెడ్డి అభినందించారు.